సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ


మంగళవారం । 23 । జనవరి । 2024



రూ.50 వేల విరాళం
ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి వెలగపూడి వెంకటేశ్వరరావు దంపతులు (విజయవాడ) రూ.50 వేల విరాళం అందజేశారు.



చదువుల మదింపు
10లో
విద్యార్థి అభ్యసనాన్ని మదింపు చేసేందుకు విద్యాశాఖ ఏటా నిర్వహిస్తున్న ఫార్మేటివ్ అసెస్‌మెంట్-3 (ఎఫ్ఏ-3) పరీక్షలు మంగళవారం ప్రారంభమవుతున్నాయి.

10,950 క్యూసెక్కుల విడుదల


ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు సోమవారం 10,950 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఆరోగ్యశ్రీ ప్రయోజనాలపై ప్రచారం



పాదలాడలో ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పిస్తున్న డీఎం అండ్ హెచ్‌ఓ దుర్గారావు దొర

రాజోలు: ఆరోగ్యశ్రీ పథక ప్రయోజనాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని డీఎం అండ్ హెచ్‌ఓ ఎం.దుర్గారావు దొర సూచించారు. సోమవారం పాదలాడ కంచికామక్షమ్మ కాలనీలో ఆరోగ్యశ్రీ కార్డు విధి, విధానాలపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సిబ్బంది ఆరోగ్యశ్రీ కార్డులతోపాటు కరపత్రాలు అందిస్తున్నారన్నారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ పథకం ఉపయోగాలను వివరిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన వీడియోను ఆరోగ్య సిబ్బంది చూపించి అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా రూ.25 లక్షల వరకు వైద్య సదుపాయంతోపాటు, శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకునే రోగులకు ప్రభుత్వం అందిస్తున్న సాయం, నెట్‌వర్క్ ఆస్పత్రుల వివరాలు వంటి అంశాలు ప్రతి ఒక్కరికీ తెలియజేస్తున్నామన్నారు. సీసీ ఆర్.రామకృష్ణారావు, తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ ఫణికిరణ్, డాక్టర్ మణికుమార్, సీహెచ్‌ఓ ఎం.ఎలిజబెత్, ఎంఎల్‌హెచ్‌పీ సంతోషిణి, ఏఎన్‌ఎం వి.సునీత, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

గడువులోగా అర్జీల పరిష్కారం

అమలాపురం రూరల్: జగనన్నకు చెబుదాం, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబులతో కలసి జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్పందన పని తీరు అర్జీదారులలో నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, సామాజిక భద్రత పింఛన్లు, సర్వే, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి 156 అర్జీలు వచ్చాయన్నారు. అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కార మార్గాలు చూపాలన్నారు. సీపీఓ వెంకటేశ్వర్లు డీఆర్డీఏ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, గ్రామ వార్డు సచివాలయం నోడల్ అధికారి కె.భీమేశ్వర్ డీపీఓ వి.కృష్ణకుమారి, డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎం.దుర్గారావు దొర, డీఎస్ఓ ఎ.పాపారావు, డీఈవో కమలకుమారి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారుల పాల్గొన్నారు.

పోలీసు శాఖకు 15 వినతులు

అమలాపురం టౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 15 అర్జీలు వచ్చాయి. ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను ఎస్పీకి ఏకరువు పెట్టుకున్నారు. వచ్చిన ఫిర్యాదుల్లో ఎక్కువగా కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలు ఉన్నాయి. వాటిలో కొన్ని అర్జీలపై ఎస్పీ శ్రీధర్ ఆయా పోలీసు స్టేషన్ల అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

అక్క చెల్లెమ్మలకు అండ

- నేటి నుంచి నాలుగో విడత వైఎస్సార్ ఆసరా సొమ్ము జమ
- జిల్లాలో 31,093 మందికి లబ్ధి
- రూ.254.24 కోట్ల మేర ఎస్‌హెచ్‌జీ సభ్యుల ఖాతాల్లోకి..
- నాలుగు విడతల మొత్తం రూ.1,015.96 కోట్లు



సాక్షి అమలాపురం: మాట ఇస్తే... మడమ తిప్పేది లేదని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి చేతలలో నిరూపించారు. స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) పొదుపు మహిళలు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను ఐదేళ్ల క్రితం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో తెలుసుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు ఉన్న రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే 2019 ఏప్రిల్ 11వ తేదీ వరకు ఉన్న ఎస్‌హెచ్‌జీ రుణాలను మాఫీ చేశారు. రద్దు చేసిన రుణాలను నాలుగు విడతలుగా మహిళల ఖాతాలో జమ చేస్తానని హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్టుగా 2020 నవంబర్ 11న మొదటి విడత, 2021 అక్టోబర్ 7న రెండో విడత, 2023 మార్చి 25న మూడో విడత సొమ్మును, తాజాగా నాలుగో విడత డబ్బును మంగళవారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. జిల్లాలో నాలుగో విడత 31,093 మందికి రూ.254.24 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. ఈ నాలుగు విడతలు కలిపి మహిళా సంఘాలకు ఏకంగా రూ.1,015.96 కోట్ల మేర లబ్ధి చేకూరింది.

బహుళజాతి సంస్థలతో ఒప్పందాలు

వైఎస్సార్ ఆసరా పథకం గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని ఎస్‌హెచ్‌జీలోని పేద మహిళల ఆర్థిక ఉన్నతికి ప్రయోజనకరంగా మారుతోంది. ఎస్‌హెచ్‌జీ మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను బహుళజాతి కంపెనీల ద్వారా విక్రయాలు చేయించడంతోపాటు వారికి బ్యాంకుల ద్వారా సకాలంలో రుణాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తొలి ఏడాది అమూల్, హిందూస్తాన్ యూనిలివర్, ఐటీసీ, ప్రోక్టర్ అండ్ గ్యాంబుల్, అలానా వంటి వ్యాపార దిగ్గజాలతో, బ్యాంకులతో ఒప్పందాలు చేసుకుంది. ద్వితీయ సంవత్సరం జియో – రిలయన్స్, గ్రామీణ వికాస కేంద్రం, టేనేజర్, మహేంద్ర–ఖేతి వంటి సంస్థలతో ఒప్పందాలు చేసుకొని వారికి వ్యాపార మార్గాలు చూపించింది.



మహిళా స్వయంశక్తి సంఘ సభ్యుల సమావేశం

14 రోజుల పాటు జమ



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆసరా సొమ్మును మహిళల ఖాతాలో జమ చేయడాన్ని మంగళవారం లాంఛనంగా ప్రారంభిస్తారు. ఫిబ్రవరి 5వ తేదీ వరకు 14 రోజుల పాటు ఈ సొమ్ము మహిళల ఖాతాలో జమ అవుతుంది. లబ్ధిదారులు ఈ విషయాన్ని గుర్తించాల్సి ఉంది.

– డాక్టర్ వి.శివశంకర్ ప్రసాద్, ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ

రూ.60 వేల ప్రయోజనం



నెల్లి మరల వెంకట లక్ష్మి

అమలాపురం మండలం కామనగరువుకు చెందిన నెల్లి మరల వెంకట లక్ష్మి సోంపాపిడి తయారు చేస్తోంది. వీటితోపాటు పలు రకాల స్వీట్‌లు, కారం ఆహార ఉత్పత్తులు తయారు చేసి జీవనం పొందుతోంది. వైఎస్సార్ ఆసరా 4వ విడత రూ.15 వేలు పొందనుంది. దీంతో కలిపి రూ.60 వేల వరకు ప్రయోజనం పొందినట్టు. 'జగన్ మా అప్పు రద్దు చేసి చాలా మేలు చేశారు. నాలుగేళ్లుగా వస్తున్న ఆసరా నిధులు నా వ్యాపారాన్ని పెంచుకోవడానికి వాడుకున్నాను' అని వెంకటలక్ష్మి తెలిపింది.

రూ.56 వేల రుణం మాఫీ

మామిడికుదురుకు చెందిన ఓదూరి మహాలక్ష్మి ఏటా క్రమం తప్పకుండా నాలుగు విడతలలో రూ.56 వేల వరకు లబ్ధి పొందింది. మామిడికుదు మండలం నగరంలో అత్యంత ఆదరణ పొందిన వంటకం గరాజీలు తయారు చేస్తూ ఆమె జీవనోపాధి పొందుతోంది. 'ఆసరా ద్వారా సొమ్ము క్రమం తప్పకుండా వస్తోంది. వీటితో వ్యాపారానికి అవసరమైన పెట్టుబడికి ఇబ్బంది లేకుండా ఉంది' అని తెలిపింది.



గరాజీలు తయారు చేస్తున్న మహాలక్ష్మి

నాలుగో విడత ప్రయోజనం ఇదీ..

నియోజకవర్గం	ఎస్‌హెచ్‌జీల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
అమలాపురం	4,422	37
కొత్తపేట	6,333	55.07
మండపేట	4,573	37.63
ముమ్మిడివరం	3,498	24.60
పి.గన్నవరం	5,469	42.64
రామచంద్రపురం	2,851	23.50
రాజోలు	3,947	33.80

నాలుగు విడతల్లో ఇలా..

నియోజకవర్గం	2020–21	2021–22	2022–23	2023–24	మొత్తం లబ్ధి (రూ.కోట్లలో)
అమలాపురం	36.97	37.09	36.99	37	148.05
కొత్తపేట	54.03	55.74	54.77	55.07	219.6
మండపేట	37.16	37.93	37.51	37.63	150.23
ముమ్మిడివరం	24.43	24.77	24.57	24.60	98.37
పి.గన్నవరం	41.75	43.57	42.57	42.64	170.53
రామచంద్రపురం	23.37	23.61	23.47	23.50	93.95
రాజోలు	33.48	34.17	33.77	33.80	135.22

ప్రాణప్రతిష్ఠ వేళ.. రామనామ హేల



అమలాపురం శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద జై శ్రీరామ్ అనే అక్షరాలతో వెలిగించిన దీపాలు

- శ్రీరామ స్మరణతో మార్మోగిన జిల్లా
- శోభాయాత్రలు, అన్న సమారాధనలు, భజనలతో పండగ సందడి
- ఎల్‌ఈడీ తెరలపై అయోధ్య ప్రత్యక్ష ప్రసారం వీక్షణం
- రామాలయాలు, ఇళ్లల్లో ఆధ్యాత్మికత పరవళ్లు
- దీపాల వెలుగులతో దేదీప్యమానం

అమలాపురం టౌన్: అయోధ్య రామ మందిరంలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా జిల్లా అంతా రామమయమైంది. శ్రీరామ నామ స్మరణతో జిల్లా మార్మోగిపోయింది. ఊరూవాడా శ్రీరామ కీర్తనలు, భజనలు, అన్న సమారాధనలు, శోభాయాత్రలు, బైక్ ర్యాలీలతో ఉదయం నుంచి రాత్రి వరకూ ఆధ్యాత్మిక సందడి నెలకొంది. జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీతోపాటు 358 గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. జిల్లాలో ఉన్న దాదాపు 800 రామాలయాల్లో శ్రీరామ పట్టాభిషేకాలు, హనుమాన్ చాలీసా పఠనాలు వంటి క్రతువులు జరిగాయి. అయోధ్యలో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ దృశ్యాలను ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఇళ్లలోని టీవీల్లో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. మండల కేంద్రం మామిడికుదురు, ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయం తదితర చోట్ల భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారాన్ని అధిక సంఖ్యలో భక్తులు వీక్షించేలా చేశారు. రామాలయాలు, ఇళ్లు, బైక్‌లు, వివిధ కూడళ్లతోపాటు రామ భక్తుల చేతుల్లో జై శ్రీరామ నామంతో ఉన్న కాషాయ జెండాలు రెపరెపలాడాయి. అమలాపురం పట్టణం, మలికిపురం, రావులపాలెం, కొత్తపేట, ముమ్మిడివరం, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, ఐ.పోలవరం, సఖినేటిపల్లి తదితర మండలాల్లో భారీ శోభాయాత్రలు జరిగాయి. ముమ్మిడివరం మండలం పల్లిపాలెంలోని శ్రీహరి సాకేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామ పూజలు భారీ ఎత్తున జరిగాయి. ఈ ఆలయం ఆధ్వర్యంలో వందలాది బైక్‌లపై మండలంలోని ప్రతీ రామాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి ఆయా ఆలయాల్లో శ్రీరాముడిని దర్శించుకున్నారు. అమలాపురంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, పలు గ్రామాల్లో అన్నసమారాధనలు జరిగాయి. శ్రీరాముని తీర్థంగా పలుచోట్ల భక్తులకు బెల్లం పానకాలు పంపిణీ చేశారు. అమలాపురం పట్టణంలో నాలుగు చోట్ల బెల్లం పానకాలు పంపిణీ నిర్వహించారు.



ముమ్మిడివరంలో శోభాయాత్ర చేస్తున్న భక్తులు

వెలుగుల్లో రామాలయాలు, ఇళ్లు

జిల్లాలోని రామాలయాలు, వివిధ ముఖ్య కూడళ్లలో రాత్రి కాగానే దీపాలు వెలిగించి ఆ పరిసరాలను దేదీప్యమానం చేశారు. రావులపాలెం పార్కు వద్ద గల రామాలయంలో నిర్వహించిన లక్ష దీపోత్సవంలో భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.5 కోట్లతో బస్‌స్టేషన్ ఆధునీకరణ



మోడరన్ ఆర్టీసీ బస్ స్టేషన్ నమూనా చిత్రం

రవాణా శాఖ మంత్రి విశ్వరూప్ వెల్లడి

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ బస్ స్టేషన్‌ను రూ.5 కోట్ల వ్యయంతో ఆధునీకరించనున్నారు. మోడరన్ బస్ స్టేషన్‌గా దీనిని నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సోమవారం సాయంత్రం ఈ విషయాన్ని స్థానిక విలేకరులకు వెల్లడించారు. మోడరన్ బస్ స్టేషన్ నమూనా చిత్రాన్ని విడుదల చేశారు. రూ.5 కోట్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పరిపాలన మంజూరు ఉత్తర్వులు విడుదల అయ్యాయని మంత్రి తెలిపారు. ఫిబ్రవరి మొదటి వారంలో శంకుస్థాపన నిర్వహిస్తామని చెప్పారు. అమలాపురం జిల్లా కేంద్రం అయినందున ముందుచూపుతో ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను ఆధునీకరిస్తున్నామని పేర్కొన్నారు. ఇది నాలుగు అంతస్తులతో నిర్మితమవుతుందన్నారు. ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కార్యాలయం, డిపో మేనేజర్ కార్యాలయంతో పాటు విశాలమైన బస్‌స్టేషన్ నిర్మిస్తామని వివరించారు. ఇప్పుడున్న బస్ స్టేషన్‌లో బస్సులు నిలిపేందుకు 12 ప్లాట్‌ఫారాలు ఉండగా, మోడరన్ బస్ స్టేషన్‌లో 24 ప్లాట్ ఫారాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అయ్యాక రాష్ట్రంలోని బస్సు స్టేషన్లన్నీ దశల వారీగా అభివృద్ధి చేసేందుకు రవాణా శాఖ ప్రణాళిక సిద్ధం చేసిందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికే కాకుండా బస్ స్టేషన్ల ప్రగతికి కూడా పెద్ద పీట వేస్తున్నారని మంత్రి విశ్వరూప్ గుర్తు చేశారు. ఇప్పటికే అమలాపురం బస్ స్టేషన్‌లో డ్రైనేజీ సౌకర్యం కోసం మంత్రి విశ్వరూప్ రూ.2 కోట్లు కేటాయించారు. ఇప్పుడు మోడరన్ బస్ స్టేషన్‌కు రూ.5 కోట్లు, డ్రైనేజీ సౌకర్యానికి రూ.2 కోట్లు వెరశి రూ.7 కోట్లతో అమలాపురం బస్ స్టేషన్ రూపు రేఖలు మారనున్నాయి.

మహిళా 'ఓటు'దే పై చేయి

- పురుషుల కన్నా 10,323 అధికం
- తుది జాబితా ప్రకటన
- జిల్లాలో 15,10,472 ఓట్లు
- పెరిగినవి 21,678

సాక్షి అమలాపురం: 'ఆకాశంలో సగం... అవనిలో సగం' అని మహిళలను అంటారు. జిల్లాలోని ఓటర్లలో మహిళలు సగం దాటేశారు. పి.గన్నవరం (ఎస్సీ), కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గాలలో మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాలలో మహిళా ఓటర్లు పురుషుల కన్నా అధికంగా ఉన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఓటర్ల తుది జాబితాను జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ –2024 ముసాయిదా ప్రకారం మొత్తం ఓటర్లు 14,88,794 మంది నమోదయ్యారు. కాని తుది జాబితా ప్రకారం మొత్తం ఓటర్లు 15,10,472 మందికి పెరిగారు. కొత్తగా 21,678 మంది ఓటర్లు పెరిగారు. వీరిలో పురుషులు 9,317 మంది కాగా, మహిళలు 12,366 మంది వరకు ఉన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 2,146, ముమ్మిడివరంలో 3,373, అమలాపురంలో 4,508, రాజోలులో 3,501, గన్నవరంలో 2,862, కొత్తపేటలో 3,037, మండపేటలో 2,251 మంది చొప్పున ఓటర్లు పెరిగారు. ట్రాన్స్‌జెండర్స్ తుది జాబితాలో ఐదుగురు తగ్గి 17 మంది ఓటర్లు నమోదయ్యారు. ముసాయిదా ఓటర్ల జాబితాలోనే కాకుండా తాజాగా విడుదల చేసిన తుది జాబితాలో కూడా మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. జిల్లాలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పురుషుల కన్నా మహిళల ఓట్లు 10,323 అధికం. రామచంద్రపురం (1,424), ముమ్మిడివరం (510), అమలాపురం (ఎస్సీ) (588) రాజోలు (2,085), మండపేట (5,743)లో మహిళా ఓట్లు అధికం కాగా, పి.గన్నవరం, మండపేటలో మాత్రం పురుషుల ఓట్లు ఎక్కువ.

జిల్లాలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు
రామచంద్రపురం	239	99,361	1,00,785	1	2,00,147
ముమ్మిడివరం	268	1,20,680	1,21,190	0	2,41,870
అమలాపురం (ఎస్సీ)	235	1,05,166	1,05,724	1	2,10,891
రాజోలు (ఎస్సీ)	205	96,552	98,637	1	1,95,190
పి.గన్నవరం (ఎస్సీ)	212	98,969	97,363	5	1,96,337
కొత్తపేట	262	1,23,389	1,11,692	5	2,48,392
మండపేట	223	1,05,949	1,11,69	4	2,17,645
మొత్తం	1,644	7,50,066	7,60,389	17	15,10,472



రాజకీయ పార్టీల నాయకులకు ఓటర్ల తుది జాబితా ప్రతులు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

తుది జాబితా ప్రతులు అందజేత

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఓటర్ల తుది జాబితాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ తుది జాబితా ప్రచురణ ప్రతులను, డిజిటల్ రూపంలో తుది జాబితా సీడీలను అందించామన్నారు. డీఆర్వో సీహెచ్ సత్తిబాబు వైఎస్సార్ సీపీ తరపున సంసానినాని ,షేక్ అబ్దుల్ ఖాదర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ముమ్మిడివరం: ముమ్మిడివరంలో బంగారు నగలు తయారు చేసుకొని జీవనం సాగించే ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ముమ్మిడివరానికి చెందిన కొప్పాజు లక్ష్మణరావు(22) ఆదివారం స్నేహితులతో కలసి చెయ్యేరు వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని సోదరుడు ముమ్మిడివరంలో గల లక్ష్మణరావు షాపులో చూడగా అతను షాపులో పడి ఉన్నాడు. ఆసుపత్రిగా తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ముమ్మిడివరం స్టేషన్ హెచ్‌సీ భైరవ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చదువుల మదింపు

- నేటి నుంచి ఎఫ్ఏ–3 పరీక్షలు
- 1–8 తరగతులకు సీబీఏ, 9, 10 వారికి పాత విధానం
- జిల్లాలో పరీక్షలు రాయనున్న 2.02 లక్షల విద్యార్థులు



విద్యార్థులు



మండల కేంద్రానికి చేరుకున్న పేపర్ బండిల్స్

రాయవరం: విద్యార్థి అభ్యసనాన్ని మదింపు చేసేందుకు విద్యాశాఖ ఏటా పరీక్షలు నిర్వహిస్తోంది. ఏటా నాలుగు ఫార్మేటివ్, రెండు సమ్మేటివ్ పరీక్షలు నిర్వహిస్తున్న విషయం పాఠకులకు విదితమే. అందులో భాగంగా ఎఫ్ఏ–3 పరీక్షలను మంగళవారం నుంచి 29వ తేదీ వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ 2,036 పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు 2022 నవంబర్‌లో ఎఫ్ఏ–1 పరీక్షలను ప్రయోగాత్మకంగా క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ (సీబీఏ) విధానంలో ప్రారంభించిన విషయం తెలిసిందే. ఎఫ్ఏ–2 పాత విధానంలో నిర్వహించగా, ఎఫ్ఏ–3 తిరిగి సీబీఏ విధానంలో నిర్వహిస్తున్నారు. 9,10 తరగతుల విద్యార్థులకు మాత్రం గతంలో మాదిరిగానే ఫార్మేటివ్ విధానంలో పరీక్షను నిర్వహిస్తారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా ఇదే విధానాన్ని అవలంబిస్తున్నారు. ఇందుకు సంబంధించి డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు పరీక్షల ఏర్పాట్లలో నిమగ్నమైంది.

ఉత్తమ ప్రమాణాలకు..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో అభ్యసన లోపాలను గుర్తించడంతో పాటుగా, పక్కా బోధనతో వారి సామర్థ్యాలను వెలికి తీయడం సీబీఏ పరీక్షల ప్రధాన ఉద్దేశం. గుణాత్మక విద్య, ఉత్తమ విద్యా ప్రమాణాలకు ఈ విధానం దోహద పడనుంది. ఎఫ్ఏ, ఎస్ఏల స్థానంలో సీబీఏ పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎఫ్ఏ1,3, ఎస్ఏ 2కు బదులుగా నూతన విధానంలో పరీక్షలు నిర్వహిస్తారు. ఎఫ్ఏ 2,4, ఎస్ఏ1 పాత విధానంలోనే నిర్వహిస్తారు. 9,10 తరగతులకు నాలుగు ఎఫ్ఏలు, ఎస్ఏలు 2 పాత విధానంలో అమలు చేస్తారు.

9,10 తరగతులకు బైలింగ్విల్ ప్రశ్నపత్రం

సీబీఏ విధానంలో 1–8 తరగతుల వారికి ప్రశ్నపత్రం పూర్తిగా ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది. 9,10 తరగతులకు బైలింగ్విల్ ప్రశ్నపత్రం ఇస్తారు. ప్రశ్నలు ఎంయూఏ విధానంలో ఇస్తారు. 15 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానం, ఐదు మార్కులకు రాత పూర్వక జవాబు రాయాల్సి ఉంటుంది. ప్రశ్నలు విద్యార్థిని సమగ్రంగా అంచనా వేసే విధంగా ఉంటాయి. మెకానికల్, అండర్ స్టాండింగ్, అప్లికేషన్ (ఎంయూఏ) విధానంలో ఉంటాయి. ఓఎంఆర్ పత్రాల్లో జవాబులు నింపి జిల్లాకు పంపించాల్సి ఉంటుంది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 2,02,532 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ యాజమాన్యాల పరిధిలో 1,08,733 మంది, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 93,799 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా, వీరందరూ ఎఫ్ఏ–3 పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రైవేట్ యాజమాన్యాలకు చెందిన విద్యార్థులు సాధారణ విధానంలోనే పరీక్షలు రాస్తారు. వీరికి సీబీఏ విధానంలో పరీక్షలు నిర్వహించరు.



మండల కేంద్రాలకు పంపాం

పరీక్ష పత్రాలు, ఓఎంఆర్ షీట్లు జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాలకు పంపించాం. పరీక్ష పేపర్లకు ఎంఈవోలు కస్టోడియన్లుగా వ్యవహరిస్తారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం.

– బి.హనుమంతురావు, ప్రధాన కార్యదర్శి, డీసీఈబీ, అమలాపురం



విద్యార్థులకు అవగాహన ఉంది

క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ విధానంపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన ఉంది. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన మార్గదర్శకాలను జారీ చేశాం.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

యాజమాన్యాల వారీగా జిల్లాలో విద్యార్థుల వివరాలు

తరగతులు	ప్రభుత్వ+ఎయిడెడ్	ప్రైవేట్
1–5	42,044	56,313
6–10	66,719	37,480

టైమ్ టేబుల్

తేదీ	సమయం	సెషన్1	సమయం	సెషన్2
1–5 తరగతులు				
23	9.30–10.30	తెలుగు	1.20–2.20	గణితం
25	9.30–10.30	ప.వి	1.20–2.20	ఇంగ్లిష్–ఎ
			2.30–2.50	ఇంగ్లిష్–బి
6–8 తరగతులు				
23	1.10–2.10	తెలుగు	2.20–3.20	గణితం
25	1.10–2.10	హిందీ	2.20–3.20	సైన్స్(పీఎస్,బీఎస్)
27	1.10–2.10	సోషల్	2.20–3.20	ఇంగ్లిష్–ఎ
27	--		3.30–3.50	ఇంగ్లిష్–బి
29	1.10–2.10	ఓఎస్ఎస్‌సీ–1	2.20–3.20	ఓఎస్ఎస్‌సీ–2
9–10 తరగతులు				
23	9.30–10.15	తెలుగు	10.30–11.15	గణితం
25	9.30–10.15	హిందీ	10.30–11.15	సైన్స్(పీఎస్+బీఎస్)
27	9.30–10.15	సోషల్	10.30–11.15	ఇంగ్లిష్–ఎ
27న	11.30–11.50	ఇంగ్లిష్–బి (9వ తరగతికి మాత్రం)		
29	9.30–10.15	ఓఎస్ఎస్‌సీ–1	10.30–11.15	ఓఎస్ఎస్‌సీ–2

రూ.లక్షా 75 వేల విలువైన నకిలీ సిగరెట్లు స్వాధీనం



నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను పట్టుకున్న రీజనల్ విజిలెన్స్ అధికారులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో రూ.లక్షా 75 వేలు విలువైన నకిలీ సిగరెట్లను అధికారులు పట్టుకున్నారు. ముందుగా వచ్చిన సమాచారం మేరకు రాజమహేంద్రవరం స్టేడియం రోడ్డులోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో శ్రీదేవి బిస్కట్స్, జనరల్ స్టోర్‌పై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, లీగల్ మెట్రాలజీ, కమర్షియల్ టాక్స్ అధికారులు సోమవారం సంయుక్త దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బ్రాండెడ్ కాని 4,010 నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను గుర్తించారు. పారిస్, గోల్డ్ ఫైటర్, ఎ 10, హార్బర్, గోల్డ్ స్టాగ్, గోల్డ్ విమల్, గోల్డ్ విమల్ మింట్ వంటి నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను అధికారులు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని నిషేధిత పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు చేస్తున్న దుకాణ యజమాని దాసరి వెంకట కృష్ణారెడ్డి, సంబంధిత వ్యక్తులపై కోప్టా యాక్ట్ 2003 కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు. వారిని టూటౌన్ పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎ.సురేష్‌బాబు మాట్లాడుతూ నిషేధిత సిగరెట్లను నిల్వ చేసినా, అమ్మకాలు జరిపినా సదరు దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో పట్టుబడ్డ సదరు బ్రాండెడ్ కాని నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను కాకినాడ నుంచి కొనుగోలు చేసినట్లు షాపు యజమాని తెలిపాడన్నారు. దాడుల్లో పట్టుబడ్డ దుకాణం, సంబంధిత వ్యక్తులపై నాలుగు కేసులు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ నాగ వెంకటరాజు, తహసీల్దార్ విజయకుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథరెడ్డి, కానిస్టేబుళ్లు లోవకుమార్, వలీ పాల్గొన్నారు.

చంద్రవరంలో మహిళ దారుణ హత్య

కత్తితో దాడి చేసిన నిందితుడు



సుజాత మృతదేహం

చాగల్లు: చాగల్లు మండలం చంద్రవరంలో మహిళపై కత్తితో దాడి చేసి హతమార్చిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం చంద్రవరం గ్రామానికి చెందిన సింహాద్రి పూర్ణచంద్రరావు 15 ఏళ్ల క్రితం మృతి చెందాడు. అతని భార్య సుజాత (48) తన ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తోంది. ఐదేళ్ల క్రితం సుజాత కుమారుడి వివాహం సందర్భంగా ఇంటికి పెయింట్స్ వేయడానికి వచ్చిన అదే గ్రామానికి చెందిన చైతన్య కుమార్‌తో కుటుంబ సభ్యులకు పరిచయం ఏర్పడింది. సోమవారం ఇంటి డాబాపై సుజాత దుస్తులు ఆరబెడుతుండగా చైతన్యకుమార్ వచ్చి కత్తితో ఆమె మెడపై బలంగా దాడి చేసి హడావుడిగా పారిపోతుండగా కుటుంబ సభ్యులు గమనించారు. డాబాపై రక్తపు మడుగులో ఉన్న సుజాతను చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని కొవ్వూరు సీఐ రమణ పరిశీలించారు. సుజాత తండ్రి మద్దిపాటి నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

నర్సరీలను సందర్శించిన డీఎంఅండ్‌హెచ్‌వో

కడియం: మండలంలోని కడియపులంకలోని శ్రీ సత్యదేవ నర్సరీ, కడియంలోని పల్ల వెంకన్న నర్సరీలను డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వేంకటేశ్వరరావు దంపతులు సోమవారం సందర్శించారు. నర్సరీల్లో ఏర్పాటు చేసిన అయోధ్య రామాలయం మొక్కల కూర్పులను దర్శించి, రైతులను అభినందించారు. ఆయన వెంట స్థానిక వైద్య సిబ్బంది ఉన్నారు.

పోటాపోటీగా జాతీయ టెన్నిస్ పోటీలు

డబుల్స్ విజేత హర్యానా, రన్నర్స్ గుజరాత్



జాతీయ టెన్నిస్ పోటీలలో డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచిన హర్యానా జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): డీఎస్ఏలో జరుగుతున్న పాఠశాల క్రీడాసమాఖ్య 67వ జాతీయస్థాయి అండర్–19 టెన్నిస్ పోటీలు సోమవారం పోటాపోటీగా జరిగాయి. మ్యాచ్‌లను రాష్ట్ర పాఠశాల క్రీడాసమాఖ్య కార్యదర్శి భానుమూర్తి రాజు, పోటీల జాతీయ పరిశీలకులు రామిరెడ్డి అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. పోటీల నిర్వహణ కార్యదర్శి ప్రసాద్, చీఫ్ రిఫరీ శ్రీకుమార్ పర్యవేక్షించారు. డబుల్స్ విభాగంలో డిమార్ట్ సమీపంలోని టెన్నిస్ కోర్టులు, పాత ఎస్పీ ఆఫీసు టెన్నిస్ కోర్టులలో మొత్తం 24 మ్యాచ్‌లు నిర్వహించారు. డబుల్స్ విభాగంలో హర్యానా గుజరాత్ పై 2–0 స్కోర్‌తో విజయం సాధించి విజేతగా నిలువగా, గుజరాత్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. తృతీయ స్థానాన్ని మహారాష్ట్ర జట్టు, నాల్గవ స్థానాన్ని ఢిల్లీ జట్టు కైవశం చేసుకున్నాయి. క్రీడాకారులకు వసతి నుంచి క్రీడామైదానాలకు మోహన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎం.మోహన్‌రావు సౌజన్యంతో ఉచితంగా బస్సులను ఏర్పాటు చేశారు. సోమవారం జరిగిన మ్యాచ్‌లను ఆర్జేడీ నాగమణి, డీవైఈఓలు రాజు, సుభద్ర, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్, ఎంఈఓలు రవి, ఏసుదాసు, శివ, ప్రసాద్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు రవిరాజు, బంగార్రాజు, రంగారావు తిలకించారు. పోటీల నిర్వహణ కమిటీలలో పీడీలు భానుమతి, ప్రసాద్, మేరి విజయ, త్రిపుల, తులసి, సత్యగౌరి, సువర్చల, శ్రీహరి సేవలు అందించారు.

బాలిక హత్య కేసులో సవతి తల్లికి జీవిత ఖైదు

కాకినాడ లీగల్: బాలికను హత్య చేసినందుకు సవతి తల్లికి జీవిత ఖైదు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ డెయిరీ ఫారం సెంటర్, సంజయ్‌నగర్, కొత్తపాకలు ప్రాంతానికి చెందిన సూరాడ శాంతి కుమారి 2019 నవంబర్ 22వ తేదీన తన సవతి కుమార్తె అయిన ఏడేళ్ల సూరాడ దీప్తిని జగన్నాథపురంలో చదువుతున్న స్కూల్ వద్ద నుంచి సంజయ్‌నగర్‌లో ఉంటున్న ఇంటికి తీసుకువెళ్లింది. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఆమె ఈ పనిచేసింది. అనంతరం బాలిక పీకను తువ్వాలుతో నులిమి హత్య చేసి, బాలికను మూటకట్టి ఇంద్రపాలెం బ్రిడ్జిపై నుంచి ఉప్పుటేరు కాలువలోకి పడవేసింది. బాలిక తండ్రి సత్య శ్యామ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై వన్‌టౌన్ పోలీసు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో శాంతి కుమారిపై నేరం రుజువుకావడంతో హత్య చేసినందుకు జీవిత ఖైదు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వై.ప్రశాంతి కుమారి ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

విద్యుత్ షాక్‌తో లైన్‌మన్ మృతి



విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన రాంబాబు

మామిడికుదురు: గోగన్నమఠం లైన్‌మన్‌గా పనిచేస్తున్న నవుండ్రు రాంబాబు (49) సోమవారం విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడ్డాడు. రొయ్యల చెరువుల వద్ద స్తంభంపైకి ఎక్కి రీ కనెక్షన్ ఇస్తుండగా షాక్‌కు గురై కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. రొయ్యల చెరువులకు సంబంధించిన విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో ఆ లైన్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం బిల్లు చెల్లించడంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు రాంబాబు స్తంభం ఎక్కాడు. అయితే అప్పటికే ఎవరో ఆ లైన్‌కు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ విషయం తెలియని రాంబాబు స్తంభం ఎక్కి ప్రమాదానికి గురై కిందపడి మరణించాడు. అంబాజీపేట మండలం వాకలగరువు గ్రామానికి చెందిన రాంబాబు ఏడాదిన్నర కాలంగా ఇక్కడ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. నగరం ఎస్సై పి.సురేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

1398 మద్యం సీసాలతో మహిళ అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకువచ్చి విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 1,398 మద్యం సీసాలను కోరంగి పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. కోరంగి ఎస్సై ఎస్.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన మహిళ పెన్నింగి దుర్గ మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆదేశాల మేరకు దాడి చేయగా అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ఆ మహిళను అరెస్ట్ చేసి కాకినాడ స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.1.50 లక్షలకు పైగా ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో సురేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.